

ఊటీని తలపిస్తున్న పొగ మంచు



ప్రజాశక్తి- గంగాధరనెల్లూరు, బైరెడ్డిపల్లి : మండలంలో సోమవారం ఉదయం ఆవలకొండ రోడ్డులో ఊటీని తలపించేలా మంచు కమ్ముకుంది. ఉదయం 9 గంటలైనా మంచు తగ్గకపోవడంతో రోడ్లపై వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి అవస్థలు పడుతున్నారు. అలాగే బైరెడ్డిపల్లి మండలం జాతీయ రహదారులపై ఉదయం 10 గంటలైనా మంచు పొగలా కమ్మేసింది. దీంతో వాహనదారులు భయపడుతూ వాహనాలు నడపాల్సి వచ్చింది. స్థానికులు చలి తీవ్రతకు ఇంటి నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు.


పిజిఆర్ఎస్‌కు 331 వినతులు

- వినతులు స్వీకరించిన జేసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి అధికారులు పనిచేయాలని, ప్రతీ అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలన్నారు. ప్రజల నుండి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షించడం జరుగుతుందని, అర్జీలు రీ ఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో మొత్తంగా 331 అర్జీలు రాగా రెవెన్యూ శాఖకు సంబంధించి 255, పంచాయతీ రాజ్ 3, పోలీస్ శాఖ 7, దేవదాయ శాఖ 3, అనిమల్ హస్బండ్రీ 7, డిపిఓ 1, డ్వామా 4, డిఆర్‌డిఎ 14, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 4, డీఈవో 3, డిఎస్ఓ 3, హౌసింగ్ 3, సర్వే ల్యాండ్ రికార్డ్స్ 2, రోడ్స్ అండ్ బిల్డింగ్స్ 2, సోషల్ వెల్ఫేర్ 2, రూరల్ వాటర్ సప్లై 1, ఎల్‌డిఎం 1, బీసీ కార్పొరేషన్ 1, డిస్టిక్ ఎంప్లాయిమెంట్ ఆఫీస్ 4, ఏపీ ఎస్పీడీసీఎల్ 1, నేషనల్ హైవేస్ 2, డిస్టిక్ లైబ్రేరియన్ 1, ఎంపీడీఓ బైరెడ్డిపల్లి 1, ఎంపీడీఓ పెనుమూరు 1, ఎంపీడీఓ వీ కోట 1, ఎంపీడీఓ పూతలపట్టు 1, ఎంపీడీఓ రామకుప్పం 1, ఎంపీడీఓ సోమల 1, ఎంపీడీఓ నగరి 1 అర్జీలు అందాయి.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న నగర కమీషనర్

వేగంగా పీజీఆర్ఎస్ వినతుల పరిష్కారం

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందే వినతులను వేగంగా పరిష్కరించాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించడానికి చర్యలు తీసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించాలని, పరిష్కరించదగిన వినతులను వేగంగా పరిష్కరించి నివేదిక సమర్పించాలన్నారు. గతవారం అందిన వినతుల పరిష్కారంపై సమీక్షించారు. సోమవారం కార్యక్రమంలో టిడ్కో 1, పింఛను 1, ఇంజనీరింగ్ 4, చొప్పున మొత్తం ఆరు ఫిర్యాదులు అందాయి. సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంఈ వెంకట రామిరెడ్డి పాల్గొన్నారు.

వీవోఏలకు బకాయి వేతనాలివ్వాలి

- మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి
- కలెక్టరేట్ ధర్నాలో వాడ గంగరాజు డిమాండ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీవోఏల సమస్యల పరిష్కారం చేయడంలో తీవ్రఅలసత్వం వహించడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 27, 28, 29 మూడు రోజులపాటు దీక్షలు చేపట్టారని ఇందులో భాగంగా సోమవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద ఏపీ వెలుగు వీవోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేయడం జరిగిందని యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు తెలిపారు. ఆయన దీక్షను ప్రారంభించి అనంతరం మాట్లాడారు. ప్రతినెలా జీతం ఇవ్వాల్సిన కనీస బాధ్యతను ప్రభుత్వం నిర్వహించకపోవడం దుర్మార్గమన్నారు. ఆరు నెలలుగా జీతం ఇవ్వకుండా పని చేయించుకోవడం వెట్టి చాకిరి అవుతుందన్నారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పిస్తామని, 3 సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని కోరారు. డిసెంబర్ 16వ తారీఖున సెర్ప్ సీఈవో సమక్షంలో జరిగిన చర్చలు, నిర్ణయాలు ఇంత వరకు అమలు కాకపోవడం అత్యంత శోచనీయమన్నారు. అక్రమంగా తొలగించిన వీవోఏలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారమన్నారు. విపరీతమైన పనిభారం పెంచారని, మహిళా మార్టలలో బలవంతపు కొనుగోళ్ళు వల్ల ప్రజలు, గ్రూపు సభ్యుల నుండి తీవ్రవ్యతిరేక వస్తోందని తెలిపారు. సమస్యలు పరిష్కారం కోసం జాయింట్ మీటింగ్ ఇంతవరకు ఏర్పాటు చేయలేదన్నారు. గ్రూప్ సభ్యులు అభయహస్తం డబ్బులు వెంటనే చెల్లించాలని తీవ్ర ఒత్తిడి చేస్తున్న విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ప్రజలు, వీవోఏల సమస్య పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందడాన్ని నిరసిస్తూ ఈ మూడు రోజులు నిరాహార దీక్షల కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. సోమవారం కొన్ని మండలాలు, మంగళవారం కొన్ని మండలాలు, బుధవారం కొన్ని మండలాలు నిరసన కార్యక్రమంలో పాల్గొంటాయని తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు జీను రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ బాబు, నాయకులు శేషాద్రి, హేమాద్రి, గీతారాణి, వీవోఏలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీవోఏలు

సమ్మర్ యాక్షన్ ప్లాన్‌కు సిద్ధం చేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద జిల్లాలో చేపట్టిన ఇండ్ల నిర్మాణంలో భాగంగా వివిధ దశలలో ఉన్న ఇంటి నిర్మాణాల పనులను పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరం నుంచి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గృహనిర్మాణ పురోగతి, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్, రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరా సంబంధిత అంశాలపై మున్సిపల్ కమిషనర్లు ఎంపీడీఓలు, హౌసింగ్ డీఈలు, ఏఈలతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరైన 77,366 ఇండ్లలో 49,321 పూర్తి కావడం జరిగిందని, 2025 జనవరి ఒకటి నుండి మార్చి 31 వరకు 7311 ఇండ్ల నిర్మాణం పూర్తి లక్ష్యంగా వివిధ మండలాలకు కేటాయించగా ఇందులో 357 ఇండ్లు పూర్తికాగా.. 6,954 ఇండ్లు ఆర్‌సి, ఆర్ఎల్ స్థాయిలో ఉన్నాయని వీటిని కంప్లీషన్ స్థాయికి తీసుకొని వచ్చేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో హౌసింగ్ అధికారులు, ఎంపీడీఓలు సమన్వయంతో పనిచేయాలన్నారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదు కాని ఇండ్లను నమోదు చేసే ప్రక్రియను ఫిబ్రవరి 15లోపు పూర్తి చేయాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు వారి పరిధిలో గల తాగునీటి సరఫరాకి సంబంధించి పబ్లిక్ టాప్‌లు పనిచేస్తున్నది లేనిది తాగునీటి బోర్లలో ఎటువంటి సమస్యలు ఉన్న వాటి మరమ్మతులకు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసే ప్రక్రియను పంచాయతీ సెక్రటరీలు కచ్చితంగా చేపట్టేలా పర్యవేక్షించాలన్నారు. సీజనల్ వ్యాధులు ఎక్కువగా కలుషిత నీరు తాగడం ద్వారానే వస్తాయని వీటిని అరికట్టడానికి శుభ్రమైన తాగునీటి సరఫరా ప్రధానమన్నారు. సమావేశంలో హౌసింగ్ ఇన్చార్జి పీడీ గోపాల్ నాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

వైసీపీ ఓటమిలో కీలకపాత్ర 'యువగళం'

- చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అభద్రతా భావం, నిరాశ, నిస్పృహలతో కొట్టు మిట్టాడుతున్న టీడీపీ శ్రేణులకు నేనున్నానంటూ నారా లోకేష్ రెండేళ్ల క్రితం యువగళం పాదయాత్రతో జనంలోకొచ్చి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓడించడంలో కీలక పాత్ర పోషించి తండ్రి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి తగ్గ తనయుడిగా గుర్తింపు తెచ్చుకున్నారని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కొనియాడారు. యువగళం పాదయాత్ర రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుకు ఎంపి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలోని 11 ఉమ్మడి జిల్లాల్లో 97 అసెంబ్లీ నియోజకవర్గాలు, 232 మండలాలు, మున్సిపాలిటీలు, 2,097 గ్రామాల మీదుగా 226 రోజులపాటు 3132 కిలోమీటర్లు మేర యువగళం పాదయాత్ర సాగిందని వివరించారు.



నారాలోకేష్‌తో ఎంపి దగ్గమళ్ళ ప్రసాద్‌రావు (ఫైల్‌ఫోటో)

కల్లు గీత కార్మికులకు
మద్యం షాపులు కేటాయింపు



మద్యం షాపుల గెజిట్ విడుదల చేస్తున్న ఎక్సైజ్ అధికారి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు కల్లుగీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు గెజిట్‌ను ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కల్లుగీత కార్మికులకు 10 మద్యం షాపులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. సోమవారం 27వ తేది నుండీ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు. ఏడు మద్యం దుకాణాలు ఈడిగ ఉప కులాలకు, ఒకటి గౌడ, 1, గౌండ్ల, 1 గౌండ్ల కులానికి కేటాయిస్తున్నట్లు చెప్పారు. వచ్చే నెల 7వ తేదీ చిత్తూరులోని షుగర్ ఫ్యాక్టరీ కళ్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ లాటరీ పద్ధతి ద్వారా మద్యం షాపులను కేటాయించనున్నట్లు తెలిపారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

కుప్పం టౌన్: కల్లు గీత కార్మికులు, ఈడిగ కులస్తులకు ప్రత్యేకంగా ప్రభుత్వం మద్యం షాపులను కేటాయించడంపై కుప్పం నియోజకవర్గ ఈడిగ కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయకులు నాగేంద్ర ప్రసాద్, వెంకటేష్, త్యాగరాజు, హరినాథ్ గౌడ్, శివశంకర్, మురళీ, లోకనాథం పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- పలమనేరు




గంగవరం మండలంలో పనిచేసే 60 మంది పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం పలమనేరు శ్రీపురం సీతారామయ్య నాగమణి చారిటబుల్ ట్రస్టు, పార్సం మంజునాథ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు ఉదయం నాలుగు గంటల నుంచి చలిని సైతం లెక్క చేయకుండా మన పరిసరాలను శుభ్రపరచే కార్యక్రమాలు చేస్తున్నారని, వారికి తన వంతుగా చిరుసహాయం దుప్పట్లు అందించడం జరిగిందని తెలిపారు. ఎల్లంపల్లి నరేంద్ర, ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కుమార్ పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టరేట్ ఏవోకి ఏపీ రైతు సంఘం వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విశాఖ డెయిరీని కంపెనీ చట్టం నుండి సహకార చట్టంలోకి తీసుకురావాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఏఓకి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈసందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శంకరన్, ఉపాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, పార్వతీపురం, విజయనగరం, అనకాపల్లి జిల్లాలతోపాటు విశాఖపట్నం అర్బన్ జిల్లా, డాక్టర్ అంబేద్కర్ కొనసీమ జిల్లా, కాకినాడ జిల్లాలలో సుమారు 3.85 లక్షల రైతుల నుండి రోజుకు 9లక్షల లీటర్ల ఆవు, గేదె పాలను విశాఖ డెయిరీ రోజు సేకరిస్తోందని, 7 జిల్లాలలో 6,720 గ్రామాలలో పాలసేకరణ జరుగుతోందన్నారు. ప్రారంభంలో కార్పొరేషన్‌గా తరువాత సహకార సంఘంగా మారిన విశాఖ డెయిరీ చట్టంలో ఉన్న లొసుగులను వినియోగించుకొని మ్యాక్స్ చట్టం కిందకు తరువాత కంపెనీ చట్టం కిందుకు విశాఖ డెయిరీయాజమాన్యం మార్చిందని, కంపెనీ చట్టంగా మారడంతో ప్రభుత్వ పర్యవేక్షణ లేక అన్ని అక్రమాలకు అవకాశం కలిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వ సహకారం, పాల రైతుల త్యాగం, సిబ్బంది చేసిన కృషితో లక్షల రూపాయలతో 1973వ సంవత్సరంలో ప్రారంభమైన విశాఖ డెయిరీ ఆస్తులు నేడు వేల కోట్లకు చేరాయని, చీమలు పెట్టిన పుట్టలో పాములు చేరినట్లు పాల రైతులు, సిబ్బంది శ్రమతో అభివృద్ధి అయిన విశాఖ డెయిరీ నేడు ఛైర్మన్‌గా వారి కుటుంబ ప్రైవేట్ ఆస్తిగా మార్చుకొని అవినీతి, అక్రమాలకు పాల్పతున్నారని ఆరోపించారు. 2024 సెప్టెంబర్ నుండి ఆవుపాల సేకరణ ధర లీటర్‌కు రూ.35నుండి రూ.31కి 4 రూపాయలు తగ్గించారని, డెయిరీ యాజమాన్యం తగ్గించిన ఆవు పాల సేకరణ ధరను పెంచాలని కోరుతూ పాల రైతులు అనేక రూపాలలో తమ నిరసన వ్యక్తం చేశారని అంతేకాకుండా పాలసేకరణ కేంద్రాల ముందు, చిల్లింగ్ సెంటర్ల ముందు, జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు నిరసనలు, ధర్నాలు చేశారన్నారు. వందల కోట్ల సహకార విశాఖ డెయిరీ ఆస్తులను ప్రైవేట్ ఆస్తులుగా మార్చుకోవడం, సేకరణ ధర తగ్గించి పాల రైతులకు నష్టం చేయడం, విచ్చలవిడిగా విశాఖ డెయిరీ ఆస్తులను కుటుంబ సభ్యుల పేరుతో ఉన్న ట్రస్టుకు బదిలీ చేయడం వంటి అక్రమాలకు విశాఖ డెయిరీ యాజమాన్యం పాల్పడుతోందని ఆరోపించారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని విశాఖ డెయిరీ యాజమాన్యం అక్రమాలపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని, అక్రమాలను అరికట్టాలని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, విశాఖ డెయిరీని కంపెనీ చట్టం నుండి సహకార చట్టం పరిధిలోకి తీసుకురావాలని, పాల సేకరణ ధర పెంచాలని కోరారు.



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

కాణిపాకం అగరంపల్లి పాఠశాలకు స్వచ్ఛ పురస్కారం

ప్రజాశక్తి- ఐరాల

ఐరాల మండలం కాణిపాకం క్లీన్ అండ్ గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్లో భాగంగా పూతలపట్టు నియోజకవర్గం, అగరంపల్లి కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌కు జాతీయస్థాయి అవార్డు దక్కిందని ఆ పాఠశాల హెచ్ఎం చంద్రఖర్ రాయుడు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరానికి తమ పాఠశాలకు జాతీయస్థాయిలో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ (సీఎస్ఈ) న్యూఢిల్లీ వారిచే నిర్వహిస్తున్న జాతీయ స్థాయి క్లీన్ అండ్ గ్రీన్ స్కూల్ అవార్డు పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి 12 పాఠశాలలు ఎంపిక చేశారని తెలిపారు. ఇందులో తమ పాఠశాల ఒకటిగా నిలవడం గర్వకారణమని చెప్పారు. ఈ అవార్డును ఫిబ్రవరి 4వ తేదీన న్యూఢిల్లీలో అందుకోనున్నట్లు తెలిపారు. ఈ అవార్డు రావడానికి కృషి చేసిన పాఠశాల ఎన్జీసీ కో ఆర్డినేటర్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు సురేంద్రబాబు, సైన్స్ ఉపాధ్యాయులను వారికి తోడ్పాటును అందించిన ఉపాధ్యాయులు సోమశేఖర్ నాయుడు, బాలయ్య, బాలసుబ్రమణ్యం, మాధవరెడ్డి, నరేష్ బాబులను అభినందించారు. వరుసగా మూడోసారి తమ పాఠశాల ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు.



కాణిపాకం అగరంపల్లి పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు

మా బిడ్డను వేధిస్తున్నాడు..

- చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి..
- పోలీసు స్టేషన్ ఎదుట న్యాయం కోసం బాధిత కుటుంబం నిరసన



స్టేషన్ ఎదుట బాధిత కుటుంబం నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి- పుంగనూరు

తమ కూతుర్ని వేధిస్తున్నాడని పలుసార్లు పుంగనూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన తమకు సరైన న్యాయం జరగలేదని బాధిత కుటుంబం అర్బన్ సర్కిల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. మున్సిపాలిటీలో ఒప్పంద కార్మికునిగా పనిచేస్తున్న చెన్నకేశవులు పట్టణంలోని కోనేటిపాళ్యంలో ఇద్దరు పిల్లలు భార్యతో కలిసి నివాసం ఉన్నాడు. తాము నివాసం ఉన్న వీధిలో సుజయ్ కుమార్ అనే యువకుడు నాలుగో తరగతి చదివే నా కుమార్తెను వెకిలి చేష్టలు, సెక్స్ వేధింపులు చేస్తూ ఇబ్బంది పెడుతున్నాడని గత ఏడాది ఐదో నెలలో మొదటిసారి పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. అయితే పోలీసులు అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా తమకే కౌన్సిలింగ్ ఇచ్చి పంపేయడం జరిగిందన్నారు. కానీ మళ్లీ ఆ యువకుడు పదేపదే తమ కుమార్తెను మమ్మల్ని వేధింపులు గురి చేస్తున్నారని తెలిపారు. దీనిపై మళ్లీ ఐదుసార్లు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కానీ అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, దీంతో ఆ యువకుడు మమ్మల్ని చంపుతామని బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ విషయం పై తమకు న్యాయం చేయాలని పలుమార్లు సీఐ దృష్టికి తీసుకుని వెళ్లిన న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైన ఆ యువకుడ్ని అరెస్ట్ చేసి న్యాయం చేయాలని లేదంటే స్టేషన్ ఎదుటి బలవర్మణానికి పాల్పడుతామన్నారు. సీఐ శ్రీనివాసులును వివరణ కోరగా ఫిర్యాదు వచ్చిన వెంటనే కేసు నమోదు చేసి అతన్ని అదుపులోకి తీసుకొని పాక్సో చట్టం కింద అరెస్టు చేయడం జరిగిందన్నారు. వారు కోర్టును ఆశ్రయించి బెయిల్ తీసుకున్నారని, దీంతో తిరిగి అరెస్టు చేయలేకపోతున్నామని తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు ఆ యువకుడిపై చర్యలు తీసుకుంటామన్నారు.

చెరువు కట్ట పరిశీలన



చెరువు కట్టను పరిశీలిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి -రొంపిచర్ల: పులిచెర్ల మండలం 106 ఇ.రామిరెడ్డి గారిపల్లి పంచాయతీలోని నాయినిచెరువు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చెరువు కట్టకు గండి పడి మరమ్మతులకు గురైంది. ఈ సమస్యను గ్రామస్తులు పుంగనూరు టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకురాగా సోమవారం ఆయన చెరువు కట్టను పరిశీలించి జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫోన్ చేసి సమస్యను విన్నవించారు. అధికారులు స్పందించి చెరువు కట్టను మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు.

జాతీయ భాషపై పట్టు పెంచుకోవాలి

ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: జాతీయభాషపై పట్టు పెంచుకోవాలని ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దశమందం హిందీ ప్రతిభా పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ దశమందం విద్యాసేవాసదన్ ప్రొద్దుటూరు వారి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో పదవ తరగతి వరకు నిర్వహించబడిన హిందీ ప్రతిభా పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో విద్యార్థులు పునీత్ సాయి, ఏపీ హేమ మెరిట్‌స్థాయిలో నిలిచారు. సిరి, కావ్య బంగారు పథకాలు, చాణక్య, శాంతి, ప్రియ వెండి పథకాలు పొందారని తెలిపారు. హిందీ ఉపాధ్యాయిని కె.భారతి మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఈ విజయాలను సాధించారని కొనియాడారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు అరుణ శివప్రసాద్, ఉపాధ్యాయులు సంజీవి, పిళ్ళారప్ప, సంపంగి, ప్రేమ కృష్ణ, ధనశేఖర్, మోహన్ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

యుగంధర్‌కు అవార్డులు



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లలో మెరుగైన ప్రతిభను చూపిన మండలం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ యుగంధర్‌కు జిల్లా వైద్యఅధికారి సుధారాణి ప్రశంసా పత్రాన్ని అందించారు. విధుల నిర్వర్తిండంలో ఉత్త ప్రతిభ కరబరించి ప్రజలకు అందించిన సేవలను ఉన్నతాధికారులు గురించి తనకు ప్రశంసా పత్రాన్ని అందించడం జరిగిందని యుగంధర్ తెలిపారు.

బాలయ్యకు పద్మభూషణ్ రావడంతో సంబరాలు


ప్రజాశక్తి- పుంగనూరు: ప్రముఖ సినీ నటుడు, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు రావడంతో పుంగునూరులో అభిమాన సంఘం సంబరాలు నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో అభిమాన సంఘ అధ్యక్షకార్యదర్శులు అప్పిరెడ్డి యాదవ్, మోపురి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్లో సోమవారం కేక్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. వారు మాట్లాడుతూ నందమూరి బాలయ్యకు ఎంతో ప్రతిష్టాత్మకమైన పద్మభూషణ్ అవార్డును కేంద్రం ఇవ్వడంతో సంతోషంగా ఉందన్నారు. అంజిరెడ్డి, సుబ్రహ్మణ్యం రాజు, మాజీ ఎంపిటీసీ గంగులప్ప పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



ప్రజాశక్తి- గంగవరం : మండలంలోని మదర్ థెరిసా విద్యాసంస్థలు ఆధ్వర్యంలో పలమనేరు ప్రభుత్వ వైద్యుల పర్యవేక్షణలో సోమవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించినట్లు కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలియజేశారు. ఈ రక్తదాన శిబిరంలో కళాశాలలో చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వారి ఆధ్వర్యంలో 35మంది రక్తదానం చేసినట్లు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రాణాపాయంలో ఉన్న రోగులకు రక్తదానం చేయడం ముఖ్యమని ఎంతోమంది అనాధలు ప్రాణాపాయం ఉన్న సందర్భాలలో రక్తం లేక తీవ్ర ఇబ్బందులకు గురి అవుతుంటారని ఇది గుర్తించి యువత ముందుకు వచ్చి రక్తదానం చేయడం గర్వకారణమని అన్నారు. అకడమిక్ అధికారి రాజేందర్ రెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సంచారజాతులను గుర్తించి ఆదుకోండి



తహసీల్దార్‌కు వినతిపత్రం సంఘ సభ్యులు

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలో అత్యంత వెనుకబడిన 32 సంచార జాతుల కులాల వారిని గుర్తించి, అర్హులకు అన్ని విధాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి ఆదుకోవాలని తహశీల్దార్ బాబుకు సంచార జాతుల సంఘం నాయకులు చలపతి, పివి సుబ్రి, నాగరాజు సోమవారం వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం సంచార జాతులకు ప్రవేశపెడుతున్న పథకాలను, ఇతర మౌలిక వసతులను లబ్ధి పొందేందుకు కులాల వారిగా సర్వే చేసి ఉన్నత అధికారులకు నివేదిక అందివ్వాలన్నారు. తమ కులాలకు వంద యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు అదేవిధంగా చూడాలన్నారు. ఇల్లు లేని వారికి స్థలాలు మంజూరు చేసి గృహనిర్మాణాలు చేపట్టాలన్నారు. తమ కులాల్లోని విద్యార్థుల అభివృద్ధికి చేయూత నివ్వాలన్నారు. రమేష్, రాజప్ప, బయ్యప్ప, రవి, మధు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఏపీ డబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యవర్గ ఎన్నికలు సోమవారం స్థానిక ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించించారు. ఎన్నికల అధికారులుగా జయచంద్ర, సాటి గంగాధరం వ్యవహరించారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర నాయకులు చంద్రమోహన్ రాజు నేతృత్వంలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ఎన్నికలకు సంబంధించి గౌరవాధ్యక్షులుగా సాటి గంగాధరం (ఆంధ్రప్రభ బ్యూరో, చిత్తూరు), అధ్యక్షులుగా బి.ప్రకాష్ (సీకేఎన్ న్యూస్, చిత్తూరు) ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక ఎమ్మెస్సార్ మున్సిపల్ కాంప్లెక్స్‌లో గల ఏపిడబ్ల్యూజేఎఫ్ చిత్తూరు జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ ఎన్నికల నామినేషన్ దాఖలు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్ష పదవితో పాటు మిగిలిన అన్ని పదవులకు ఒక్కో నామినేషన్ చొప్పున మాత్రమే దాఖలయ్యాయి. దీంతో జిల్లా అధ్యక్షులుగా బి.ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా షేక్ సలీం (ఎన్ టివి, పుంగనూరు), కోశాధికారిగా పి.కపానందరెడ్డి (నేటి మనదేశమ్ దినపత్రిక, చిత్తూరు), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గిరిశేఖర్ (ఆంధ్రజ్యోతి, పుంగనూరు), ఉపాధ్యక్షులుగా పి.రాజేంద్ర నాయుడు (టీవీ 5 చిత్తూరు), ఆర్.చంద్ర (వార్త, తవణంపల్లి, కాణిపాకం), ఈ. దేవరాజులు (ప్రజాశక్తి, ఎస్ఆర్ పురం), మహమ్మద్ సైపుల్ల (ఆర్ టివి, పుంగనూరు), జగన్నాథరెడ్డి (సికేఎన్ న్యూస్ కుప్పం), జి.లక్ష్మీనారాయణ (సుమన్ టీవీ, కుప్పం) ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నరేంద్రబాబు (ప్రజాశక్తి, రామకుప్పం), ప్రచార కార్యదర్శిగా ఎస్జే దినేష్ కుమార్ (కురుక్షేత్రం, చిత్తూరు)లు ఎన్నికయ్యారు. అదేవిధంగా జిల్లా సంయుక్త కార్యదర్శులుగా ఎం.శ్రీనివాసులు (ప్రజాశక్తి, పుంగనూరు), కే.రామయ్య (వార్త, పుంగనూరు), టీఎస్ విజయ్ (హెచ్ఎం టీవీ, కార్వేటినగరం), యాదవేంద్రరెడ్డి (పిసిఎన్ న్యూస్, చిత్తూరు), గందోడి హరిప్రసాద్ (కురుక్షేత్రం ఎడిటర్, చిత్తూరు), కేజీ.నాగరాజు (మనం దినపత్రిక కుప్పం), ఏ.జయప్రకాష్ (ప్రైమ్- 9 న్యూస్, జీడి నెల్లూరు), గౌరవ న్యాయ సలహాదారులుగా ప్రకాష్ (సాక్షి, పుంగనూరు), గౌరవ సలహాదారులుగా ముత్యాలు (కేసి టీవీ అధినేత) ప్రభు నాయుడు (పిసిఎన్ న్యూస్ అధినేత చిత్తూరు), బి.జగదీష్ (సికేఎన్ న్యూస్ ఎడిటర్, చిత్తూరు), వి.కృష్ణ (ఫ్రీ లాన్సర్/ సీనియర్ జర్నలిస్ట్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఎన్నికల పరిశీలకులుగా చంద్రమోహన్, జిల్లా ఎన్నికల అధికారులుగా సాటి గంగాధరం, చల్లా జయచంద్ర వ్యవహరించారు. నూతన కార్యవర్గం జిల్లాలో ఏపీడబ్ల్యూజేఎఫ్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాష్ట్ర నాయకులు కవరకుంట్ల జయరాజ్, సీనియర్ జర్నలిస్టులు కృష్ణ, బాలసుబ్రమణ్యం, కేశవులు, కడియాల మహేష్ బాబు, మునిరాజులు పాల్గొన్నారు.



అధ్యక్షులు ప్రకాష్, కార్యదర్శి షేక్ సలీమ్

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే



ప్రజాశక్తి -విజయపురం (నగరి): థామస్ ఆల్వా ఎడిసన్ బల్బు కనుగొన్న రోజును పురస్కరించుకొని ఎలక్ట్రీషియన్ డేను నగరి ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. థామస్ ఆల్వా ఎడిసన్‌కు జోహార్ చెబుతూ కేక్ కత్తిరించి సంబరాలు చేసుకున్నారు. బస్టాండు ప్రాంగణం నుంచి ఓంశక్తి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. నగరి మండల ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎఎస్.రవి మాట్లాడుతూ మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు జిల్లా ఎలక్ట్రీషియన్ సంఘం ద్వారా పరిష్కరించుకుందామని తెలిపారు. మనం ఐక్యతతో ముందుకు వెళ్లినప్పుడే అది సాధ్యమన్నారు. సంఘ కార్యదర్శి ప్రభు, ట్రెజరర్ దామోదరం, సభ్యులు కేటీ.శ్రీనివాసులు, కెపి.కుమార్, బాషా, ఈశ్వరన్, ఎంఎస్ మురళి, ఇంద్రయ్య, ఎన్‌సీ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

ఓవర్ హెడ్ ట్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి- కార్వేటినగరం: వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీలు అభివృద్ధిపథంలో నడిచాయని మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయ వర్మ అన్నారు. సోమవారం పంచాయతీ పరిధిలోని పద్మసరస్సు ఉన్న గొల్లఇండ్లు వద్ద జేజేఎం పథకం ద్వారా రూ.20.90 లక్షల నిధులతో నిర్మాణం చేపట్టిన ఓవర్ హెడ్ ట్యాంకును ఎంపీటీసీ లక్ష్మమ్మతో కలసి ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇంత వరకు ఒక్క పథకాన్ని కూడా అమలు చేసిన పాపానపోలేదన్నారు. మేజర్ పంచాయతీలో రూ.కోటి 25 లక్షలతో ట్యాంకు నిర్మాణం చేపట్టి ప్రజలకు తాగునీటి సమస్యకు స్వస్థి పలకడం జరిగిందన్నారు. మేజర్ పంచాయతీని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి దత్తతకు తీసుకుని ఎక్కడాలేని విధంగా అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. గ్రామాల అభివృద్ధి ఒక్క మాజీ సీఎం జగన్మోహన్రెడ్డితో సాధ్యమవుతుందని నిరూపించుకున్నారని తెలిపారు. నాయకులు వెంకటేష్, గురుమూర్తి పాల్గొన్నారు.

పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: పట్టణంలో పురపాలక సంఘం తరపున అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలను సోమవారం చేపట్టారు. ముఖ్యంగా పట్టణ పరిధిలో దోమలు పెరగకుండా పురపాలక సంఘం తరపున నిర్వహిస్తున్న దోమల నివారిణి పిచ్చికారి పనులను కొనసాగించారు. పాతపేట చెరువుకట్ట వద్ద ఉన్న పెద్ద కాలువ పూడికతీత పనులను చేపట్టారు. ఈ పనులను స్థానిక కౌన్సిలర్ సురేష్ పర్యవేక్షించారు. అలాగే పట్టణ పరిధిలోని 19వ వార్డులో రెండు బోరు బావులను త్వవించి ప్రజల నీటి సమస్యలు పరిష్కారం చూపారు. పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, కమిషనర్ శ్రీనివాసరావును టిడిపి నాయకులు, కౌన్సిలర్లు ఘనంగా సన్మానించారు.

4న వైభవంగా 'రథసప్తమి'

ప్రజాశక్తి -విజయపురం (నగరి): రథసప్తమి ఆర్జిత కళ్యాణోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించుకుందామని డీవైఈవో నాగరత్నమ్మ అన్నారు. సోమవారం పట్టణ పరిధిలో టీటీడీ ఆధీనంలోని శ్రీ కరియమాణిక్య స్వామివారి ఆలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు, సేవా సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 4వ తేదీన నిర్వహించనున్న రథసప్తమి ఆర్జిత కళ్యాణోత్సవం సంబంధించిన ఏర్పాట్లపై ఆరా తీశారు. 4వ తేదీ ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు స్వామివారికి, దేవేరులకు తిరుమంజన సేవ, సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు ఆర్జిత కళ్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. కళ్యాణోత్సవంలో పాల్గొన దలచిన వారు రూ.500లు ఆలయ అధికారుల వద్ద చెల్లించి రశీదులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తుల సంఖ్యకు తగిన పందిళ్లు, ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ, పుష్పాలంకరణ, చేపడుతున్నామని అన్నారు. అధిక సంఖ్యలో ప్రసాద వినియోగం చేస్తామన్నారు. కళ్యాణోత్సవ ఉభయదారులకు ఆలయం తరపున ప్రసాదాలు అందించడం జరుగుతుందన్నారు. ఏఈవో రవి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఇన్‌స్పెక్టర్లు రమణ, గుణశేఖర్, ప్రధానార్చకులు ధన్వంతరి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటిపై సోలార్‌ను అమర్చుకోండి..

ప్రజాశక్తి- శాంతిపురం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కుప్పం నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా 100 శాతం సోలార్ విద్యుత్ వినియోగం జరగాలని సోమవారం గుంజార్లపల్లిలి పంచాయతీ పెద్ద బొమ్మనపల్లి గ్రామంలో సర్పంచ్ విజయరామిరెడ్డి (జానీ) ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్తుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒకరూ తమ సర్వీసు నెంబరు కరెంట్ బిల్లు అందించి వంద శాతం సబ్సిడీతో ప్రతి ఇంటి మీద సోలార్ ప్లేట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇందువల్ల విద్యుత్తు ఆదా కావడమే కాకుండా సోలార్‌లో మిగులు విద్యుత్తును కూడా అమ్ముకోవచ్చు అని తెలిపారు. రెస్కో లైన్మెన్ రాము, ఆనంద్ రెడ్డి, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ చిత్తూరు జిల్లా సర్వసభ్య సమావేశం సోమవారం చిత్తూరులో జరిగింది. రాష్ట్ర నాయకత్వం తరపున జిల్లా ఎన్నికల పరిశీలకులుగా కడప జిల్లాకు చెందిన కామ్రేడ్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షులుగా చల్లా జయచంద్ర 10టీవీ చిత్తూరు, ప్రధాన కార్యదర్శిగా నీరజాక్షులు (చిన్న) టివి9 గంగాధర నెల్లూరు, వర్క్ ప్రెసిడెంట్‌గా ఎం.కుమార్ ఐ న్యూస్ కుప్పం, ఉపాధ్యక్షులుగా శివశంకర్ రాజు హెచ్ఎంటీవీ పుంగనూరు, కృష్ణమూర్తి సికేఎన్ చిత్తూరు, సుబ్రహ్మణ్యం టీవీ 9 కుప్పం, విజయ్ హెచ్ఎం టివి, విజయ్, దేవేంద్ర మహా న్యూస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కేశవులు సిటీ కేబుల్, సహాయ కార్యదర్శులుగా లోకేష్ టీవీ ఫైవ్, సుబ్రహ్మణ్యం సాక్షి టీవీ, మురళీకృష్ణ సెవెన్ హిల్స్ టీవీ, రవి జీటీవీ, కమలాకర్ రెడ్డి ఆర్‌టివి, మంజునాథ్ ప్రైమ్ నైన్, జావిద్ బిఆర్ న్యూస్, కోశాధికారిగా అక్రమ్ ఎన్టీవీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జయంచంద్ర నీరజాక్షులు (చిన్న)

విద్యార్థులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: పట్టణంలోని ఐఆర్ఎం కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు తిరుపతి పట్టణంలోని అలిన్ కెరీర్ సంస్థ వారు అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల అధ్యక్షులు బిఎం.దయానిధి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులకు జరగబోవు మెయిన్స్, నీట్ వంటి పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆలిన్ కెరీర్ హెడ్ డాక్టర్ శ్రీపని విద్యార్థులు పోటీపరీక్షలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించినట్టు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐ.ఆర్.ఎం కళాశాల వారు నూతనంగా ప్రారంభిస్తున్న ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఐదవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రవేశాలు జరుగుతున్నాయని, ఈ పాఠశాల ప్రతిభను గుర్తించడానికి ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన వారికి ప్రతిభా ధ్రువపత్రాలను అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం అవగాహన సదస్సు నిర్వహించిన వారిని విద్యాసంస్థ అధ్యక్షులు ఘనంగా సన్మానించి, అభినందించారు.



శ్రీపని ని సన్మానిస్తున్న కళాశాల అధ్యక్షులు బిఎం.దయానిధి

ఇనాం భూముల కబ్జాపై విచారణ జరిపించండి

రాష్ట్ర బీసీ ఫ్రంట్ ఉపాధ్యక్షులు



ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలో ఇనాం భూముల భూ కబ్జాపై విచారణ జరిపించాలని రాష్ట్ర బీసీ ఫ్రంట్ ఉపాధ్యక్షులు గెడిదేసి వెంకటరమణ మండల తహసిల్దార్ సిఎస్.అనిల్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ మండల బీసీ ఫ్రంట్ ఆధ్వర్యంలో పెద్దపంజాణి పంచాయతీకి చెందిన మాజీ రెవెన్యూ కార్యదర్శి వెంకటరమణ రావు ఇనాం భూముల కబ్జా చేసినట్లు భూములు పైన సమగ్రమైన విచారణ జరిపి లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ పారంబోకు భూమి సర్వే నెంబర్ 28/2లో 12 ఎకరాల 25 సెంట్లు భూమిలో బోరు వేశారని సంబంధించిన బోరుకు కరెంటు సర్వీసులు తొలగించాలని ట్రాన్స్కో ఏఈకి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులు పూలె గోవిందు స్వామి, నక్క రామచంద్రయ్య, మండల బీసీ అధ్యక్షులు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు రెడ్డెప్ప, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

నిరుద్యోగ నిర్మూలనకు.. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కృషి

మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు



విలేకర్ల సమావేశంలోమాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్ నూతన పారిశ్రామికవేత్తలకు ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరిచిందని, రాష్ట్రంలో నిరుద్యోగ నిర్మూలనకు, రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కుప్పం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి దావోస్ పర్యటన విజయవంతంగా ముగిసిందని, ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జగన్ మోహన్‌రెడ్డి నిర్వాకానికి రాష్ట్రంలో పారిశ్రామిక రంగం అంధకారంలో కూరుకుపోయిందన్నారు. తిరిగి పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడానికి తండ్రికొడుకులు రేయింబవళ్ళు కష్టపడుతున్నట్టు తెలిపారు. ఏఐ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రపంచ దిగ్గజాలతో రాష్ట్ర ప్రభుత్వం భేటీ కావడం జరిగిందన్నారు. నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనియర్ చంద్రశేఖర్, పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, డాక్టర్ వెంకటేష్, వేణు, ఆర్ముగం, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు : ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

పలమనేరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరిశ్రమల స్థాపనకు స్వర్గధామిగా మారిందని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన విజయవంతం కావడాన్ని హర్షిస్తూ సోమవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరల్డ్ ఎకనామిక్ ఫారం సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. జగన్మోహన్ రెడ్డి చేసిన నిర్వాకానికి అంధకారంలోకి వెళ్ళిన పారిశ్రామిక రంగానికి కొత్త వెలుగులు తెచ్చేందుకు సీఎం చంద్రబాబు, నారా లోకేష్‌లు రేయింబవళ్లు కష్టపడుతున్నారన్నారు.

జెడ్పీ సీఈవోను కలిసిన మాజీ సర్పంచ్



ప్రజాశక్తి- వెదురుకుప్పం : జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడుని, జిల్లా పంచాయతీ అధికారి డిపిఓ సుధాకర్ రావుని మాజీ సర్పంచ్ చంద్రమౌళి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. గతంలో ఈయన వెదురుకుప్పం మండలం గొడుగుచింత సర్పంచ్‌గా గతంలో ప్రజలకు సేవలను అందించారు.

క్రైం న్యూస్

కనకదుర్గ ఫైనాన్స్‌లో నకిలీ బంగారం

రూ.2.80 కోట్లు స్వాహా

- సిబ్బంది చేతివాటం - ఆరుగురిపై కేసు నమోదు



ప్రజాశక్తి- పుంగనూరు : పట్టణంలో కనకదుర్గ ఫైనాన్స్ బంగారు నగలు తాకట్టులో సిబ్బంది చేతివాటం చూపించి 2 కోట్ల80 లక్షల రూపాయలు స్వాహా చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులో కనకదుర్గ ఫైనాన్స్‌ని బంగారు నగలు తాకట్టు పెట్టే కార్యాలయం ఉంది. తాకట్టు పెట్టిన నగలను తీసుకెళ్లడానికి వినియోగదారుడు వెళ్ళగా అతనికి నకిలీ బంగారాన్ని ఇచ్చారు. అతను ఫిర్యాదు మేరకు అసలు విషయం బయటపడింది. కనకదుర్గ ఫైనాన్స్ విజయవాడకు చెందిన కిషోర్ బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జయచంద్రశేఖర్ రెడ్డి మేనేజర్, బి.నరసింహులు ఏరియా మేనేజర్, రామాంజనేయులు ఆడిటర్, ఖాజా పీర్, బ్రాంచ్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ శ్రావణ్ కుమార్, జగదీష్ క్యాషియర్ కలసి నకిలీ బంగారం తాకట్టులోఉంచి 2 కోట్ల 80 లక్షలు నగదును స్వాహా చేశారు. వినియోగదారుల ఫిర్యాదు మేరకు అసలు విషయం బయటపడడంతో కనకదుర్గ ఫైనాన్స్ ప్రధాన కార్యాలయం నుంచి దర్యాప్తు చేయగా సంఘటన బయటపడింది. పుంగనూరు పోలీసులు ఆరుగురి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు అందరూ పరారీలో ఉన్నారు.

10 లీటర్ల నాటు సారా స్వాధీనం

వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : మండలంలోని చప్పిడిపల్లి పంచాయతీ పరిధిలో జంగాల అగ్రహారం గ్రామ సమీపానగల ఆంజనేయస్వామి గుడి ప్రాంగణంలో అదే గ్రామానికి చెందిన పట్టాభి అనే వ్యక్తి నాటుసారా అమ్ముతున్నాడని స్థానిక పోలీసులకు సమాచారం రావడంతో ఎస్సై పరశురాముడు తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. పరిశీలించగా సదరు వ్యక్తి సారా అమ్ముతున్నట్టు గుర్తించి అతని వద్ద నుండి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకోవడంతోపాటు అతన్ని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

సారా ఊట ధ్వంసం



ప్రజాశక్తి -విజయపురం (నగరి): ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది సోమవారం నగరి సర్కిల్ పరిధిలోని విజయపురం కేవీ పురంలో తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి దక్షిణ, పడమర దిశలో ఉన్న చివ్వాడ చెరువు చుట్టూ నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 3వేల లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీదారుల కొరకు గాలింపు చేపట్టినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ తెలిపారు. సారా తయారీ, అక్రమ మద్యం, కల్తీ మద్యం విక్రయాలకు సంబంధిత సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నెంబరు 14405కు ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది సిద్ధయ్య, రామచంద్ర, సురేంద్ర, విజయ్, గీత పాల్గొన్నారు.

అదుపుతప్పిన కారు.. ఇద్దరికీ గాయాలు



ప్రజాశక్తి- గుడిపాల: కారు అదుపుతప్పి ఇద్దరికీ గాయాలైన ఘటన మండల పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై రామ్మోహన్ వివరాల మేరకు.. సోమవారం ఉదయం 7 గంటల సమయంలో మదురై నుండి తిరుపతి వెళుతున్న కారు గొల్లమడుగు లక్ష్మీనరసింహ కాలేజ్ వద్ద లారీని తప్పించబోయి అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఇందులో ప్రయాణిస్తున్న కృష్ణమూర్తి, గుణవతికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే సిఎంసి ఆసుపత్రికి 108 అంబులెన్స్ ద్వారా సిబ్బంది శివ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

జనావాసంలో పందులు పట్టివేత

ప్రజాశక్తి - విజయపురం (నగరి): పందుల పెంపకందారులకు మున్సిపల్ పరిధిలో ఎక్కడా పందులు మేపరాదంటూ మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఇచ్చిన చివరి గడవు ముగియడంతో సోమవారం జనావాసంలో ఉన్న పందులను పట్టివేయడం ప్రారంభించారు. దీంతో పందుల పెంపకందారులు హుటాహుటిన మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. కొంత గడువు ఇస్తే మరోసారి పొరపాటు జరగకుండా చూసుకుంటామన్నారు. దీంతో మున్సిపల్ కమిషనర్ వారికి మరో ఏడు రోజులు గడువు ఇచ్చారు. ఆపై ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.